విలీన గ్రామాలపై శీతకన్ను

- ఏళ్లు గడిచినా అభివృద్ధికి దూరం
- డ్రెయినేజీలు, రోడ్లు అస్తవ్యస్తం
- ఇబ్బంది పడుతున్న ప్రజలు
- పట్టించుకోని అధికారులు

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాలకు ప్రత్యేక నిధుల కేటాయించి అభివృద్ధి చేస్తామని నాయకులు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోవడం లేదు. పన్నులను విపరీతంగా పెంచి వసూలు చేస్తున్నారే తప్ప అభివృద్ధి పనులు విస్మరిస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. విలీన గ్రామాలపై అటు అధికారులు, ఇటు ప్రజాప్రతినిధులు చిన్నచూపు ప్రదర్శించడంతో అభివృద్ధికి ఆమడదూరంలో ఉంటున్నాయి. సిరిసిల్ల మున్సిపల్‌లో దాదాపు ఆరేళ్ల క్రితం రగుడు, ముష్టిపల్లి, చంద్రంపేట, చిన్నబోనాల, పెద్దబోనాల, పెద్దూరు, సర్దాపూర్ గ్రామాలను విలీనం చేశారు. కానీ ఏ వార్డులో చూసినా అస్తవ్యస్తంగా డ్రెయినేజీలు, రోడ్లు దర్శనమిస్తున్నాయి. మౌలిక వసతులు కరువై ఇబ్బంది పడుతున్నారు. సమస్యలను పట్టించుకునే వారు లేక ఎవరికి చెప్పుకోవాలో తెలియక విలీన గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పై చిత్రంలో కనిపిస్తున్నది సిరిసిల్ల మున్సిపల్ పరిధి చంద్రంపేట 12వ వార్డులోని ఏగోలపు జయేంద్ర ఇల్లు. వార్డులోని మురుగు నీరంతా ఈ మహిళ ఇంటి చుట్టూ తిరిగి ఈదుల చెరువు కాలువలోకి వెళ్తుంది. డ్రైనేజీ నిర్మాణం చేపట్టకపోవడంతో ఇంటి చుట్టూ దుర్గంధం వెదజల్లుతోంది. డ్రైనేజీ నిర్మించాలని పలుమార్లు అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధి దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు.



ఇది పెద్దూరులోని మాలపల్లే వెళ్లే మార్గంలోనిది. డ్రెయినేజీ నిర్మించక మురుగు పారడం లేదు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇక్కడే కాదు విలీన గ్రామాల్లోని చాలా చోట్ల ఇదే పరిస్థితి నెలకొంది. డ్రెయినేజీలు, సరైన రోడ్లు లేక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

అభివృద్ధికి ఆమడ దూరంలో..

సిరిసిల్ల మున్సిపాలిటీలో కలిస్తే అన్ని రకాలగా అభివృద్ధి చెందుతామని ఆశించిన ప్రజల కోరిక నేటికి నెరవేరడం లేదు. పలు గ్రామాల్లో డ్రెయినేజీలు, రోడ్లు వేసినప్పటికీ పూర్తిస్థాయిలో నిర్మించలేదు. కొన్నిచోట్ల అసలు డ్రెయినేజీ లేక మురుగు నీరు పారక ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తమ సమస్యలు పరిష్కరించాలని పలుమార్లు అధికారులను వేడుకుంటున్న ప్రయోజనం లేదని వాపోతున్నారు. విపరీతంగా పన్నుల పెంచి వసూలు చేస్తున్నారే తప్ప అభివృద్ధి చేయడం లేదంటున్నారు. గ్రామ పంచాయతీలుగా ఉన్నప్పుడే కాస్తయినా అభివృద్ధి జరిగేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పట్టించుకోవడం లేదు



మా గ్రామంలో నెలకొన్న సమస్యలను పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎవరు పట్టించుకోవడం లేదు. డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉంది. కొన్నిచోట్ల వీధి దీపాలు వెలగడం లేదు. గ్రామ పంచాయతీలుగా ఉన్నప్పుడే సమస్యలు తొందరగా పరిష్కారమయ్యేవి.

– తుమ్మ విజయ్‌కుమార్ పెద్దూరు

డ్రెయినేజీ నిర్మించడం లేదు



ఊరులోని మురుగు నీరంతా మా ఇంటి చుట్టూ కచ్చా కాలువ ద్వారా ఈదుల చెరువులోకి వెళ్తోంది. డ్రెయినేజీ లేక ఇంట్లోకి వెళ్లేందుకు ఇబ్బందిగా ఉంది. విషపురుగులు సైతం కచ్చాకాలువలో సంచరిసున్నాయి. డ్రెయినేజీ నిర్మించాలని స్థానిక ప్రజాప్రతినిధిని కోరినా పట్టించుకోవడం లేదు. అధికారులు స్పందించాలి.

– ఏగోలపు జేయేంద్ర, 12వ వార్డు చంద్రంపేట

పక్షపాతం చూపిస్తున్నారు



విలీన గ్రామాలపై ప్రభుత్వం పక్షపాతం చూపిస్తోంది. అరకొర నిధులతో విలీన గ్రామాలు పూర్తిస్థాయిలో అభివృద్ధికి నోచుకోవడం లేదు. మా వార్డులకు వచ్చిన నిధుల లో కోతలు విధిస్తూ వేరే వార్డులకు కేటాయించి నిర్లక్ష్యం చేస్తున్నారు. విలీనమైన గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పాటును అందించాలి.

– బొల్గం నాగరాజ్, 10వ వార్డు కౌన్సిలర్

క్లుప్తంగా

వ్యవసాయ అనుబంధ రంగాలకు పెద్దపీట



చెక్కు అందజేస్తున్న నాయకులు

ఎల్లారెడ్డిపేట: వ్యవసాయ అనుబంధ రంగాలను అభివృద్ధి చేసేందుకు రైతులకు పెద్ద ఎత్తున రుణాలను అందిస్తున్నట్లు సింగిల్‌విండో చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి అన్నారు. స్థానిక పీఏసీఎస్ ద్వారా జెడ్పీటీసీ లక్ష్మణ్‌రావుతో కలిసి ఆయన రుణాల చెక్కులను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు ఆర్థిక స్వావలంబన సాధించాలంటే వ్యవసాయంతో పాటు దాని అనుబంధ రంగాలైన డెయిరీ, గొర్రెలు, పట్టుపురుగులు, కోళ్ల పెంపకంపై దృష్టి సారించాలన్నారు. వీటితో పాటు బోరు మోటర్ పైపులైన్, ట్రాక్టర్, హార్వెస్టర్లకు దీర్ఘకాలిక రుణాలు అందిస్తున్నారమన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, డైరెక్టర్లు నర్సింహారెడ్డి, నర్సయ్య, సీఈవో సనుగుల కిషోర్‌కుమార్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

‘కంటి వెలుగు’ శిబిరం ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ నర్సయ్య

ముస్తాబాద్: మండలంలోని వెంకట్రావుపల్లెలో కంటి వెలుగు శిబిరాన్ని జెడ్పీటీసీ గుండం నర్సయ్య గురువారం ప్రారంభించారు. సెస్ డైరెక్టర్ సందుపట్ల అంజిరెడ్డి, ఎంపీటీసీ రామచంద్రారెడ్డి, సర్పంచ్ లక్ష్మణ్, ఉపసర్పంచ్ తిరుపతిరెడ్డి, వైద్యాధికారి గీతాంజలి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలం రాజేశ్వర్‌రావునగర్ కాలనీలో కంటి వెలుగు శిబిరాన్ని గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ పిట్ల పావని, ఉపసర్పంచ్ అశోక్, ఆలయ కమిటీ చైర్మన్ బాబు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బ్యుటీషియన్ కోర్స్ ప్రారంభం



శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎంపీపీ

ఎల్లారెడ్డిపేట: స్థానిక వృద్ధుల డేకేర్ కేంద్రంలో బ్యుటీషియన్ శిక్షణ ఎంపీపీ పిల్లి రేణుక గురువారం ప్రారంభించారు. మహిళ శిశు సంక్షేమ శాఖ అధ్వర్యంలో 30 రోజుల పాటు కిషోర బాలికలకు ఉచితంగా ఇచ్చే ఈ శిక్షణతో స్వయం ఉపాధిని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కదిరె భాస్కర్‌గౌడ్, ఎంపీటీసీ పందిర్ల నాగరాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరిత, శిక్షకులు లింగాల దివ్య, టీచర్లు, బాలికలు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సమ్మె





కోనరావుపేట/రుద్రంగి: వీవోఏల నిరవధిక సమ్మె కొనసాగుతోంది. కోనరావుపేటలో వీవోఏలు చేస్తున్న సమ్మెకు ఐద్వా నాయకురాలు జవ్వాజి విమల మద్దతు ప్రకటించారు. వీరిని సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. కనీసం రూ.26 వేల వేతనాన్ని అందించి, బీమా తదితర సౌకర్యాన్ని కల్పించి సమస్యలు పరిష్కరించాలని కోరారు.

పేరుకుపోయిన ధాన్యం

వేములవాడరూరల్: మండలంలోని లింగంపల్లి గ్రామంలో పెద్ద ఎత్తున రైతుల ధాన్యం కల్లాల వద్ద కొన్ని రోజులుగా నిల్వలు పేరుకుపోయాయి. అయినప్పటికీ కొనుగోళ్లు ప్రారంభించకపోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. లారీల కొరత వల్ల కూడా కొనుగోళ్లు జరగడం లేదని వారు అంటున్నారు. లారీల డ్రైవర్లు బస్తాకు రూ.3 ఇస్తేనే లారీలు వస్తాయని తెలుపుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వెంటది వెంటనే ధాన్యాన్ని తరలించాలని రైతులు కోరుతున్నారు.

బండపల్లిలో ఇదే పరిస్థితి

చందుర్తి: మండలంలోని బండపల్లి గ్రామంలో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో లారీల కొరతతో వారం రోజులుగా కొనుగోళ్లు నిలిచి పాయాయని రైతులు వాపోతున్నారు. ధాన్యం మాయిశ్చర్ వచ్చిన 10 రోజులు గడిచిపోతున్న ధాన్యం కాంటా కాకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా లారీల కొరత లేకుండా చూసుకోవాలని రైతులు కోరుతున్నారు.



లింగంపల్లిలో పేరుకుపోయిన ధాన్యం కుప్పలు

ఆయిల్‌పామ్ సాగుతో అధిక దిగుబడులు

ఎల్లారెడ్డిపేట: రైతులు వరికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌ఫామ్ పంటపై దృష్టి సారించి అధిక దిగుబడులు సాధించాలని మండల వ్యవసాయాధికారి చాడ భూంరెడ్డి అన్నారు. ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్‌లో ఆయిల్‌పామ్ పంటల సాగుపై గురువారం రైతులకు అవగాహన కల్పించారు. పంట సాగుకు ప్రభుత్వం రైతులకు రాయితీపై మొక్కలను అందజేస్తుందన్నారు. డ్రిప్ ఇరిగేషన్‌పై ఎస్సీ, ఎస్టీలకు 100 శాతం, బీసీలకు 90 శాతం, ఇతరులకు 80 శాతం రాయితీ ద్వారా మొక్కలను అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఒక ఎకరా వరి పండించే నీటితో 2–3 ఎకరాల ఆయిల్‌పామ్ సాగు చేసుకోవచ్చాన్నారు. ఆయిల్‌పామ్ పంటలు సాగు చేస్తున్న రైతులకు ప్రభుత్వం ఎకరాకు రూ.4 వేలు వారి ఖాతాలో జమ చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓలు లక్ష్మణ్, శ్రీశైలం, రైతుబంధు అధ్యక్షుడు సంగెం బాలయ్య, ఉపసర్పంచ్ మెడిశెట్టి బాలయ్య, రైతులు పాల్గొన్నారు.

ఆయిల్ పామ్ సాగు రైతులకు సన్మానం

తంగళ్లపల్లి: మండలంలోని బద్దెనపల్లి రైతు వేదికలో ఏవో సంతోష్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సు నిర్వహించారు. క్లస్టర్ పరిధిలో సాగు చేస్తున్న రైతులు కొక్కిరాల సత్యనారాయణ, పన్యాల విఠల్‌రెడ్డిని ఎంపీపీ పడిగెల మానస సన్మానించారు. వీరిని ఆదర్శంగా తీసుకుని రైతన్నలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో మండల రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు కొమ్మిటి రాజిరెడ్డి, ఎంపీటీసీ ప్రసూన, సర్పంచ్ ఆనందరావు, ఏవో సందీప్, ఆగం రావు, ఏఈవోలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ పడిగెల మానస

సిరిసిల్లఅర్బన్: సిరిసిల్ల మున్సిపల్ పరిధి చిన్నబోనాలలోని రైతువేదికలో గురువారం ఆయిల్ పామ్ సాగుపై ఏవో అనూష అవగాహన కల్పించారు. రైతుబంధు సమితి మండలాధ్యక్షుడు అగ్గిరాములు, కౌన్సిలర్ నాగరాజుగౌడ్, సత్యనారాయణ, పీఏసీఎస్ చైర్మన్ జీల కిషన్, వెంకటరమణారావు, ఉద్యానవనశాఖ ఏరియా మేనేజర్ సతీశ్, ఏఈవో సాయివైష్ణవి పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలంలోని దమ్మన్నపేటలోని రైతువేదికలో రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై ఏవో వెంకటేశ్ గురువారం అవగాహన కల్పించారు. వరి, పత్తికి ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ తోటలను పెంచేందుకు ప్రభుత్వం రైతులకు ప్రోత్సాహం కల్పిస్తోందని తెలిపారు. రాయితీపై ఎరువులు, మొక్కలు అందించడంతో పాటు ఈజీఎస్ ద్వారా గుంతలు తీయించి మొక్కలు నాటిస్తోందని వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ సిరిగిరి లక్ష్మీ, ఏఈవో రాకేష్, ప్రవీణ్, రైతులు పాల్గొన్నారు.

కుంగుతున్న వంతెన

- నిర్మాణంలో నాణ్యతాలోపం
- వాహనదారుల ఇబ్బందులు

కోనరావుపేట: ఎన్నో ఏళ్లుగా ఒకవైపు రవాణా సౌకర్యం లేక, వర్షాకాలంలో ఒర్రె నీళ్లతో నిండిపోయి రాకపోకలు నిలిచిపోయి నానా అవస్థలు పడ్డారు ఆ గ్రామాల ప్రజలు. ఆ ఒర్రెపై వంతెన నిర్మించాలనే కోరికను ప్రభుత్వం గుర్తించి బ్రిడ్జి నిర్మించడంతో ఆ కష్టాలన్నీ మరిచిపోయారు. కాని వంతెన పగుళ్లు బారి, ఇరువైపులా రహదారి కుంగుతుండడంతో రవాణా కష్టాలు మళ్లీ ప్రారంభమయ్యాయి. కోనరావుపేట మండలం సుద్దాల–వేములవాడ మండలం మారుపాక గ్రామాల మధ్య ఒర్రెపై వంతెన నిర్మాణానికి పీఎంజీఎస్‌వై నుంచి రూ.81 లక్షల నిధులు మంజూరయ్యాయి. ఈ పనులను ఎమ్మెల్యే రమేశ్‌బాబు 2017 నవంబర్ 4న పనులు ప్రారంభించారు. ఈ నిధులతో సుద్దాల–మర్తనపేట ప్రధాన రహదారిలో వంతెన నిర్మించారు. నిర్మించిన కొద్ది నెలలకే వంతెన పగుళ్లు బారుతుండగా, వంతెన ఇరుపక్కల ఉన్న రోడ్డు కుంగిపోతోంది. దీంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతూ వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.



ప్రమాదకరంగా మారిన వంతెన

జరుగుతున్న ప్రమాదాలు

వంతెన ప్రమాదకరంగా మారడంతో ఈ ప్రదేశంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. పగటి వేళ వచ్చే వాహనాలు సైతం దెబ్బతింటున్నాయి. ఒక్కసారిగా కుదుపుకు గురవుతున్నాయి. రాత్రివేళ లో కుంగిన ప్రదేశం ఏర్పడక వాహనాలు అదుపు తప్పి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి.

పగుళ్లు బారుతున్న వంతెన

వంతెన పనుల్లో నాణ్యతాలోపాలు కూడా కనబడుతున్నాయి. పనులు నాణ్యతతో చేపట్టకపోవడంతో ఇరుపక్కల నిర్మించిన గోడలు పగుళ్లు బారుతున్నాయి. వంతెన నిర్మించిన కొన్నేళ్లకే పగుళ్లు బారుతుండడంతో వంతెన మనుగడపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

వాహనాలు దెబ్బతింటున్నాయి



వంతెన ఇరుపక్కల రోడ్డు కుంగుతుండడంతో వాహనాలు వెళ్లడం కష్టంగా మారుతోంది. ద్విచక్ర వాహనాలతో పాటు భారీ వాహనాలు దెబ్బతింటున్నాయి.

– దొబ్బల ప్రవీణ్‌కుమార్, సుద్దాల

మరమ్మతు చేపట్టాలి



మంగళ్లపల్లి, సుద్దాల, కనగర్తి, పల్లిమక్త గ్రామాల ప్రజలకు ముఖ్యమైన ఈ రోడ్డు నాణ్యతాలోపం కారణంగా ఇబ్బంది పడుతున్నాం. మరమ్మతు చేయించాలి.

– అవురం సురేశ్, మంగళ్లపల్లి

పనులు చేయిస్తాం



వంతెన పక్కల కుంగిన ప్రాంతాన్ని తొలగించి మళ్లీ నిర్మించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించాం త్వరలోనే మరమ్మతు చేయించి ఇబ్బంది కలుగకుండా చూస్తాం.

– భూమేశ్వర్, డీఈ, పంచాయతీరాజ్

మహిళా సంక్షేమానికి పెద్దపీట

సిరిసిల్లటౌన్: మహిళల సంక్షేమానికి సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని సిరిసిల్ల మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ అన్నారు. గురువారం స్థానిక విద్యానగర్, గణేష్‌నగర్, తుక్కారావుపల్లిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కుట్టు శిక్షణ కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. మహిళలకు నచ్చిన కుట్టు, బ్యూటీషియన్ కోర్సులు నేర్చుకుని స్వయం ఉపాధితో సాధికారత సాధించాలని సూచించారు. డీడబ్ల్యూవో లక్ష్మీరాజం, సీడీపీవో అలేఖ్య పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ కేంద్రాలు ప్రారంభం

వేములవాడరూరల్: మండలంలోని హన్మాజీపేటలో కుట్టు శిక్షణ శిబిరాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మలాదేవి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు జంకె శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

సిరిసిల్లకల్చరల్: పట్టణంలోని గణేశ్‌నగర్‌లో సీడీపీవో అలేఖ్య ప్రారంభించారు.

తంగళ్లపల్లి: మండల ప్రజా పరిషత్ కార్యాలయ భవనం, జిల్లెల్లలో శిక్షణ కేంద్రాలను ఎంపీపీ పడిగెల మానస ప్రారంభించారు.



కుట్టుమెషిన్ అందిస్తున్న చైర్‌పర్సన్ జిందం కళ

ఇల్లంతకుంట: మండలంలోని పొత్తూరు గ్రామంలో ఎంపీటీసీ పట్నం అశ్విని ప్రారంభించారు.

ముస్తాబాద్: మండలంలోని బందనకల్‌లో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరవింద ప్రారంభించారు.

బోయినపల్లి: మండలంలోని విలాసాగర్ గ్రామంలో కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఎంపీపీ పర్లపల్లి వేణుగోపాల్, సర్పంచ్ స్వప్నాంజలి ప్రారంభించారు.

గంభీరావుపేట: మండలంలోని నర్మాల గ్రామంలో ఎంపీపీ వంగ కరుణ ప్రారంభించారు.

వీర్నపల్లి: మండల కేంద్రంలో ఉచిత కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రేణుక, సర్పంచ్ దినకర్ ప్రారంభించారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు

ఇల్లంతకుంట: ఇల్లంతకుంటలోని వారసంతలో తిప్పారపు విష్ణుష్(3) తప్పిపోయి ఏడుస్తుండగా స్థానికులు సర్పంచ్ భాగ్యలక్ష్మికి తెలపగా.. ఆమె ఎస్సైకి సమాచారం అందించారు. హెడ్‌కానిస్టేబుల్ భూమయ్య బాలుడిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ విషయం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో అప్పటికే కొడుకు కోసం వెతుకుతున్న తల్లిదండ్రులు శ్రీమాన్–లావణ్య దంపతులు పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని తప్పిపోయిన కుమారుడిని తీసుకెళ్లారు. తమ కొడుకును అప్పగించిన పోలీసులకు ఆ దంపతులు కృతజ్ఞతలు తెలిపారు.



బాలుడితో తల్లిదండ్రులు

సమాచారం

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

బోయినపల్లి: మండల కేంద్రంలోని ఆగ్రోస్, డీసీఎమ్మెస్ కేంద్రాలతో పాటు కోరెం పీఏసీఎస్, వెంకట్రావుపల్లి కేడీసీఎంఎస్‌లలో రైతులకు సబ్సిడీపై జీలుగ విత్తనాలు అందించనున్నట్లు ఎంఏవో ప్రణీత ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు ఈ నెల 19 నుంచి రైతు వేదికల్లో అందుబాటులో ఉండే ఏఈవోలను ఆధార్, పట్టాదార్ పాస్‌బుక్కులతో సంప్రదించాలని కోరారు. జీలుగ విత్తనాలు 30 కేజీల బస్తా ధర రూ. 2407.50 కాగా, 65 శాతం సబ్సిడీ రూ. 1564.80 ఉంటుందన్నారు. 35 శాతం డబ్బులు రూ.842.70 చెల్లించి విత్తనాలు తీసుకోవాలని కోరారు.

చందుర్తి: మండలంలోని సనుగుల, చందుర్తి సింగిల్‌విండో కార్యాలయం సబ్సిడీపై జీలుగు విత్తనాలు పంపిణీ చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఇన్‌చార్జి వ్యవసాయాధికారి ప్రణీత తెలిపారు. రైతులు పట్టేదారు పాసుబుక్, ఆధార్ కార్డులతో రైతు వేదికల్లో ఏఈవోలను సంప్రదించి నమోదు అయిన తరువాత వారిచ్చే రశీదులను తీసుకెళ్లి ఆయా సింగిల్‌విండో పరిధిలో గల గ్రామాల రైతులు తెచ్చుకోవాలని తెలిపారు.

నియామకం

బీఎస్పీ మండల ఇన్‌చార్జిగా సందీప్

ఎల్లారెడ్డిపేట: మండల బీఎస్పీ ఇన్‌చార్జిగా స్థానిక లింగాల సందీప్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు వరదవెల్లి స్వామిగౌడ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. తనకు ఈ అవకాశం కల్పించిన జిల్లా అధ్యక్షుడితో పాటు రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌కు సందీప్ కృతజ్ఞతలు తెలిపారు.

హ్యూమన్ రైట్స్ మండల యూత్ అధ్యక్షుడిగా తిరుపతి

తంగళ్లపల్లి: మండల కాంగ్రెస్ హ్యూమన్ రైట్స్ యూత్ అధ్యక్షుడిగా ఎడ్ల తిరుపతిని నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు గుగ్గిళ్ల భరత్ గౌడ్ గురువారం నియామక పత్రాన్ని అందజేశారు.

బీసీ సంక్షేమ సంఘం విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా అరవింద్

వేములవాడఅర్బన్: తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం వేములవాడ నియోజకవర్గ విద్యార్థి విభాగం అధ్యక్షుడిగా సంకెపల్లికి చెందిన నాంపల్లి అరవింద్‌ను నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు బత్తుల మహేందర్ యాదవ్ ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిపారు.

విద్యార్థినికి సన్మానం

గంభీరావుపేట: పదిలో 10 జీపీఏ సాధించిన మండలంలోని కొత్తపల్లి జెడ్పీహెచ్ఎస్ విద్యార్థిని కడవేరుగు సుప్రియకు గురువారం గ్రామస్తులు సన్మానించారు. శాలువాలతో సత్కరించి జ్ఞాపిక అందజేశారు. ఎంపీపీ వంగ కరుణ, ప్రధానోపాధ్యాయులు శంకర్, గంగారాం, నాయకులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు ఆర్థిక చేయూత

ఎల్లారెడ్డిపేట: సీఎం కప్ క్రీడలలో గెలుపొందిన క్రీడాకారులు జిల్లా స్థాయిలో ఆడేందుకు ప్రోత్సాహంగా జెడ్పీటీసీ చీటీ లక్ష్మణ్‌రావు రూ.10 వేల నగదును గురువారం అందజేశారు.

కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ

చందుర్తి: మండలంలోని ఆశిరెడ్డిపల్లెకు చెందిన శీలం ప్రవళికకు, చిలువేరి సాహిత్య, కొలిపాక గాయిత్రి, మర్రిగడ్డకు చెందిన ఎగుమామిడి వైష్ణవికి తహసీల్దార్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి గురువారం చెక్కులను ఎంపీపీ లావణ్య పంపిణీ చేశారు.

స్కాలర్‌షిప్‌కు ఎంపిక

సిరిసిల్లఎడ్యుకేషన్: నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు స్థానిక జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు అక్షయ, సహస్ర, హన్సిక ఎంపికయినట్లు డీఎస్‌ఐ దేవయ్య ఒక ప్రకటనలో తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కోనరావుపేట: సిరిసిల్ల నుంచి రామన్నపేట ఏరియాకు ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను బ్లూకోర్ట్ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద అనుమతి పత్రాలు లేకపోవడంతో ఠాణాకు తరలించారు.

నమిలిగుండుపల్లిలో పోలీస్ మీకోసం

వేములవాడరూరల్: మండలంలోని నమిలిగుండుపల్లి గ్రామంలో గురువారం రాత్రి పోలీసుల ఆధ్వర్యంలో గ్రామంలో మీకోసం కార్యక్రమం నిర్వహించారు. సైబర్ నేరగాళ్ల మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. షీటీమ్ గురించి వివరించారు. ఆస్తి వివాదాలు, మైనర్లకు వాహనాలు ఇవ్వడం వల్ల కలిగే అనర్థాల గురించి వివరించారు.